క్లుప్తంగా

28న కురువల ఆత్మీయ సమ్మేళనం

ఆదోని అర్బన్: పట్టణంలోని భీరప్ప దేవాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు కురువ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కురువ కుల పెద్దలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని కురువ కులస్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

ఆదోని అర్బన్: కోసిగి మండలం సజ్జలగూండెం గ్రామానికి చెందిన రత్నమ్మను పాము కాటు వేయడంతో బుధవారం అస్వస్థతకు గురైంది. బంధువులు ఆమెను హుటాహుటిన ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇంటి వద్ద పాముకాటు వేసినట్లు బంధువులు తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

13 మంది వలంటీర్లు రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 13 మంది వార్డు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను వార్డు అడ్మిన్‌లకు అందజేశారు. రాజీనామాల ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి సిఫార్సు చేశారు. వీరిలో 16వ వార్డు పరిధిలోని శ్రావణ్, వరలక్ష్మి, ఎల్లమ్మ, సరోజ, ఆంజనేయులు, రాజేశ్వరి, భారతి, నాగలక్ష్మి, పులిరాజు, జోష్ణ, రంగస్వామి, విజయలక్ష్మి, కె.రాజు, బి.రాణి ఉన్నారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం


నిజాముద్దీన్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న జయమనోజ్ కుమార్‌రెడ్డి

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బుధవారం ఆదోని పట్టణం 38, 39 వార్డుల పరిధిలోని నిజాముద్దీన్ కాలనీ, హనుమాన్‌నగర్, ట్యాంకు ఏరియా, ఎరుకల కాలనీ, పంచయ్యమఠం ప్రాంతాల్లో ఎమ్మెల్యే కుమారుడు జయమనోజ్ కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి హిరణ్మయిరెడ్డి, ఎమ్మెల్యే కుమార్తెలు గౌతమిరెడ్డి, మనోవిద్యారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. గడపగడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, సాయిప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు పోలకల్ రేణుక, కౌన్సిలర్లు ఫయాజ్, సునీతారెడ్డి, ఎరుకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోన వెంకన్న రథోత్సవం


అశ్వవాహనంపై శ్రీవారు

సి బెళగల్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా క్రిష్ణదొడ్డి కోన వేంకటేశ్వరస్వామివారి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కంబదహాల్, ఇనగండ్ల, సంగాలతో పాటు గూడూరు, కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూర్ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి గణపతి పూజ, పుణ్యాహవాచకం, సంప్రోక్షణ గావించి అర్ధరాత్రి 12 గంటలకు కుంభం ప్రారంభించారు. కుంభం కాగు రథం దగ్గరకు చేరుకున్న అనంతరం పెద్ద ఎత్తున బాణ సంచా కాలుస్తూ బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు మహారథోత్సవం నిర్వహించారు. శ్రీవారి రథోత్సవం వీక్షించేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా బుధవారం సాయంత్రం అశ్వవాహన సేవ, గజ వాహన సేవ అనంతరం పార్వేట కార్యక్రమం జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు.

అట్టహాసంగా నామినేషన్


ప్రజలకు అభివాదం చేస్తున్న బాలనాగిరెడ్డి


నామినేషన్‌కు తరలివచ్చిన జన సందోహం

- మంత్రాలయం ఎమ్మెల్యే స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి నామినేషన్
- భారీ జన సందోహంతో ర్యాలీ

మంత్రాలయం : నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలో మండలాల నుంచి తరలివచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి రాఘవేంద్రసర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. రాఘవేంద్ర సర్కిల్‌లో అభిమానులు ఆయనకు భారీ గజమాలతో సత్కారం చేశారు. 10.30 గంటల సమయంలో నామినేషన్ పత్రాలను ఆర్వో మురళికి అందజేశారు. ఆయన సోదరుడు టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి ఓ సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం బాలనాగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు గెలుపొందానని, మరోసారి తనను ఓటుతో ఆశీర్వదించి నాలుగోసారి గెలిపించాలని కోరారు. నాయకులు ప్రహ్లాదాచారి, భీమిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, మురళీరెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు.


ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో..


ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో..


మంగమ్మ ఆధ్వర్యంలో బయలుదేరిన మహిళలు

నామినేషన్‌కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కౌతాళం: మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వై.బాలనాగిరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజప్రతినిధులు భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి సీనియర్ నాయకుడు సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి ఆధ్వర్యంలో సుమారు 50కు పైగా వాహనాల్లో కార్యకర్తలు వెళ్లారు. ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉరుకుంద, ఓబుళాపురం, తిమ్మాపురం గ్రామాల నుంచి తరలి వెళ్లారు. ఎరేగేరి నుంచి సర్పంచ్ గోవిందు, ఇన్‌చార్జ్ నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో, సులేకేరి ఇన్‌చార్జ్ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో, గుడికంబాలి నుంచి సర్పంచ్ సిద్దేశ్, ఉప్పరహాల్ నుంచి ఏకాంబర్‌రెడ్డి ఆధ్వర్యంలో, రౌడూరులో పాండురంగారెడ్డి, బాపురం నుంచి ఇన్‌చార్జ్ గురునాథ్‌రెడ్డి, నదిచాగి నుంచి ఇన్‌చార్జ్ రామన్నగౌడ్, కుంబళనూరు నుంచి అనిల్‌కుమార్.. వివిధ గ్రామాల నుంచి వేలాదిగా కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

కోసిగి: వై.బాలనాగిరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం తరలివెళ్లారు. మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు దళవాయి మంగమ్మ ఆధ్వర్యంలో మహిళలు తరలివెళ్లారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల నుంచి వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు వెళ్లారు.


కౌతాళం నుంచి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

అత్యధిక మెజార్టీని అందిస్తాం

పెద్దకడబూరు : ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి పెద్దకడబూరు మండలం నుంచి గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీని అందిస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంత్రాలయంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా మండలం నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి అత్యధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. గత ఎన్నికల్లో మండలం నుంచి 9వేలకు పైగా మెజార్టీ వచ్చిందని, ఈ ఎన్నికల్లో 15వేలకు పైగా మెజార్టీ వస్తుందని, ఇందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తామని చెప్పారు. సర్పంచ్ రామాంజనేయులు, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విజయేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు పాల్గొన్నారు.


పెద్దకడబూరు నుంచి తరలి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు


సులేకేరి నుంచి తరలి వెళ్తున్న నాయకులు


ఏరిగేరి గ్రామం నుంచి..


గుడికంబాలి నుంచి..

ఘనంగా జేలా వేడుకలు


జేలాను గోపురంపైకి ఎక్కిస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానకంగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగా స్వామి దర్గాలో జేలా వేడుకలు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ఉత్సవాలకు నెల ముందు జేలా వేడుకలు నిర్వహించడం అనవాయితీ అని ధర్మకర్త తెలిపారు. ఈ కార్యక్రమం 1881 నుంచి దర్గా ఆరవ పీఠాధిపతి సయ్యద్‌షా బాఖార్‌వలి చిష్టీ నుంచి నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో కలరా, మశూచి వంటి రోగాలతో ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలు బయటపడాలని, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేడకలకు భక్తులు మంగళవారం రాత్రి నుంచే తరలిరావడంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. సాయంత్రం స్వామి వారి చిత్రపటంతో పాటు పూలతో కూడిన జేలాను పురవీధుల్లో ఊరేగించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ ఖాదర్‌బాషా చిష్టీ, గుల్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు మున్నపాషా, నజీర్‌అహ్మద్, ఖాదర్‌లింగ శిష్యులు పాల్గొన్నారు.


దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న ధర్మకర్త


స్వామివారి చిత్రపటం, జేలాను ఊరేగిస్తున్న దృశ్యం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద గ్రామానికి చెందిన గట్టూరి బ్రదర్స్‌తో పాటు పది కుటుంబాలు ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బాలనాగిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన గట్టూరి చిన్న ఈరన్న, రవికుమార్, మేలిగేరి నాగరాజు, లక్ష్మన్న, సాలిబసప్ప కుమారుడు ఈరన్న,కిష్టప్ప, కురవ మారన్న, చాకలి ఆళ్లప్ప, బేగారి నరసింహులు, అళ్లప్ప మాట్లాడుతూ పదేళ్ల నుంచి టీడీపీలో కొనసాగుతున్నా తమకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని, కేవలం జగనన్న ప్రభుత్వంలోనే అందుతున్నాయని చెప్పారు. పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు.

ఆరోరోజు ఆరు నామినేషన్లు


వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సాయిప్రసాద్‌రెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న మనోజ్‌రెడ్డి

ఆదోని రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆదోని నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఆరో రోజు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.సాయిప్రసాద్‌రెడ్డి తరఫున ఆయన తనయుడు మనోజ్‌రెడ్డి మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ నుంచి రమేష్‌యాదవ్, జైభీమ్‌రావు పార్టీ నుంచి కె.రంగన్న, స్వతంత్ర అభ్యర్థిగా దస్తగిరినాయుడు, బీజేపీ నుంచి పార్థసారథి తరఫున రెండు, మూడు సెట్ నామినేషన్లను విట్టా రమేష్, దేశాయిచంద్రన్న ఆర్వో శివనారాయణ్‌శర్మకు దాఖలు చేశారు.

పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల అబ్జర్వర్ మిర్‌తారిఖ్ ఆలీ
- ఆదోని ఆర్వో కార్యాలయం తనిఖీ

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని ఆర్వో కార్యాలయాన్ని బుధవారం ఎన్నికల అబ్జర్వర్ (ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల పరిశీలకుడు) మిర్‌తారిఖ్ ఆలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏప్రిల్ 30వ తేదీ నాటికి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్, షెడ్, ఫర్నీచర్, షైన్‌బోర్డులు, బారికేడ్లు, టాయిలెట్స్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్ మ్యాప్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో మంచి వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. మే 13వ తేదీ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యేందుకు మూడు గంటల ముందు సెక్టోరల్ అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్ ఓటర్లు క్యూలో వేచి ఉండకుండా ఓటు వేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకముందు సబ్‌కలెక్టర్, ఆర్వో శివనారాయణశర్మ ఎన్నికల అబ్జర్వర్‌కు శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


ఎన్నికల అబ్జర్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్వో శివనారాయణ శర్మ

అభ్యర్థుల బ్యాంకు ఖాతా నుంచే ఖర్చులు జరగాలి

- ఆదోని ఎన్నికల అధికారి శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల బ్యాంకు ఖాతా నుంచే ఖర్చులు జరగాలని ఆదోని సబ్‌కలెక్టర్, ఎన్నికల అధికారి శివనారాయణశర్మ అన్నారు. బుధవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు మించి ఖర్చు చేయరాదన్నారు. అభ్యర్థులు ప్రచార నిమిత్తం వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, పోస్టర్స్, ర్యాలీలు, కరపత్రాలు తదితర ఖర్చులకు నామినేషన్ రోజు సమర్పించిన బ్యాంకు ఖాతా నుంచే ఖర్చు జరగాలన్నారు. పార్టీ అభ్యర్థులు అనుమతి తీసుకున్న ప్రకారమే ఖర్చు చేయాలని సూచించారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్‌స్క్వాడ్, వీడియో టీంలు నియోజకవర్గంలో పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. ఈ నెల 25వ తేదీతో నామినేషన్ల పర్వం పూర్తవుతుందని.. 26వ తేదీ స్క్రూట్నీ జరుగుతుందన్నారు. నామినేషన్ ఉపసంహరణ ఏప్రిల్ 27, 28, 29వ తేదీల్లో ఉంటాయన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గంలో జరిగే హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగే సమయానికి నామినేషన్ వేసిన అభ్యర్థి, లేదా వారి తరఫున ఏజెంట్ కచ్చితంగా హాజరుకావాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహరించాలని కోరారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న ఆర్వో శివనారాయణశర్మ

క్వాడ్రాంట్స్ మైన్స్ పరిశీలన

కర్నూలు (న్యూటౌన్): ఒడిసా రాష్ట్రానికి చెందిన మైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు సంజయ్ కుమార్ దాస్, అంబురాజ, జగన్నాథ్‌మిశ్రా, ఆదిత్య బుధవారం ఓర్వకల్లు క్వాడ్రాంట్స్ గనులు, ఖనిజాలను పరిశీలించారు. అంతకు ముందు కర్నూలు మైనింగ్ డీడీ కార్యాలయంలో జిల్లా అధికారులను కలిశారు.